# ముద్దు కూతురు

శ్రీమతి వి. సరస్వతిగారు

కమల లక్ష్మణరావుగారి ఏకపుత్రిక. లక్ష్మణరావు ఇంజనీరుగానుండి చాలాధనము సంపాదించి పించను పుచ్చుకొనుచుండెను. అతనికి రంగరావను కొమారుడు బయటూర ఉద్యోగముననుండెను. అతని వెనుక పదునారేండ్ల తర్వాత, వారి నానందాబ్ధి తేల్చ కమల జనించెను. చకోరములకు సుధాకిరణములును, కమలములకు సూర్యుడును, ఎట్టి ఆనందము గూర్తురో, లక్ష్మణరావుదంపతులకు కమల అట్టి ఆనందము కలుగచేయుచుండెను. వీరి ఆనందమును జూచి విధాత ఓర్వలేక కమల తల్లిని, కమలకు నాల్గవయేటనే యమునిపాలు గావించెను. తల్లిలేనిలోటు తోచనీక లక్ష్మణరావే కమలకు తల్లియు తండ్రియువలెనుండెను. ఆమెకు చిన్నతనమున ఆటలు నేర్పెను. బాల్యముననే విద్యారంభము గావించి, చక్కగా చదువనేర్పెను. ఆమె చాల చురుకుగల పిల్ల గనుక అతిత్వరితముగా నేర్చుకొనెను. తండ్రితోగూడ ఆమె కావ్యాలంకారములు చదువుచు మధ్య మధ్య వాటిని గురించి అతనితో తర్కించుచుండును. ఆమె నొక బాలికాపాఠశాలకు లక్ష్మణరావు పంపెను. ఆమె పదునారేండ్లు ముగియక మునుపే మెట్రిక్యులేషను పరీక్షయందు కృతార్థురాలయ్యెను. ఇంకను చదువ తండ్రికిని తనయకును చాల యిష్టముండెను గాని, వైద్యు, డామె శరీరము దార్ఢ్యముగాలేదనియు, విశ్రాంతి తీసుకొనవలెననియు చెప్పెను. అందుపై ఆమె, ఇంటియందేయుండెను గాని విద్యాభ్యాసము వదలలేదు.

౨

రాత్రి పన్నెండు ఘంటలు కొట్టెను. ఒక విశాలమగు భవనమునందు వసారాలో, చప్పుడుచేయక అడుగులువైచుచు మనుష్యులిటునటు తిరుగుచుండిరి. బల్లపై మందుసీసాలు నాలుగైదు (కాగితము లంటించి) యుండెను. ఎఱ్ఱటికన్నులును చెదరిన వెంట్రుకలునుగల బాలిక యొకతె 'నర్స్, నీవు కొంచెము విశ్రమింపుము. నేనుండెదను" అని బలవంతముగా ఆమె చేతి తోలుతిత్తిని తీసుకొనెను. ఆమె "వందనములు'' అని చెప్పి చప్పుడు చేయకుండా గదివిడిచి మరియొకగదిలోనికి పోయెను.

కొంతసేపటికి రోగి కన్నులుదెరచి, 'కమలా' అని హీనస్వరముతో పిలచెను. కమల "ఏమి బాబూ" అని అతనిని సమీపించెను. రోగి, "కమలా, కాగితము కలము తెమ్ము. మరణశాసనము వ్రాయవలెను" అని లేవబోయెను. కమల అతనిని మెల్లగా పరుండబెట్టి, "నాన్నా మీరు పండుకొనుండి. జ్వరముతగ్గును. మీకిప్పుడేమీ భయములేదు. శాసనము రేపు వ్రాయవచ్చును" అని అతనిని మెల్లగా తట్టెను. లక్ష్మణరావు పరుండిన మరునిముషమే ప్రజ్ఞావిహీనుడయ్యెను. నర్సు "టెలిఫోను"వద్దకు పోయి రోగి చనిపోయినాడని వైద్యునితో చెప్పెను. కమల నిలుచున్నట్లే క్రిందబడి మూర్ఛపోయెను.

770

౩

తండ్రి చనిపోయినతర్వాత రెండు మూడు రోజులవరకు కమలకు శరీర మొకవిధముగా మొద్దుపారియుండెను. మెదడు పనిచేయుటలేదు. దిగ్భ్రమ పట్టినదానివలె నుండెను.

అయిదవరోజునుండి కమలకు హృదయమున అగ్నిజ్వాలవలె మంట పుట్టుచుండెను. ఆ మంటయే ఆమెను నిద్దురలేపును. పక్షుల మధురగానము, మనోహరమగు పండు వెన్నెల రాత్రులు, శాంతభావమును పురికొల్పు సంధ్యయు, ఆమె మనసుకు శాంతముగాని ఆనందముగాని కూర్చలేదు.

౪

కమలసోదరుడు, రంగరావు, తండ్రి ఉత్తరక్రియలకై వచ్చియుండెను. అన్నియు ముగిసినవెనుక, తా నాయూరనుండుట లేదు గనుక ఇల్లు సమ్మనెంచెను. లక్ష్మణరావు మరణశాసనము వ్రాయునందున ఆస్తి అంతయు రంగరావునకే చేరెను. పెండ్లి పేరంటములు లేక తండ్రిప్రేమకంతయు అధిపతియైయుండినందువల్ల కమలపై, వారి భార్యాభర్తల కొకవిధమైన ఈర్ష్యయుండెను గాని ప్రేమ లేదు. అయినను వారు కమలను తమతోగూడ రమ్మని చెప్పిరి. కమల చాలా స్వతంత్రాభిమానముగల పిల్ల. వదినకు తన్ను చూచిన చాలా అలక్ష్యమని గ్రహించి వారితోడ వెళ్ళనని ఖండితముగా చెప్పివైచెను. ఆమెకు నగలు రెండువేలరూపాయలు ఖరీదు చేయునవియుండెను. ఆమె వాటినిఅమ్మి, ఆపైకముతో, తనవిద్యను కాలేజిలోచేరి ముగించి, పిమ్మట యొకజీవనాధారము కలుగజేసుకొనవలెనని నిశ్చయించెను. ఆమె, నెలకు అయిదురూపాయలకు ఒకగదిని అద్దెకు పుచ్చుకొనెను. తనవంట తానేచేసుకొని, ఆపాత్రలన్నియు శుభ్రపరచి, ఇంటిపనులన్నియు చేసుకొని, చదువుకొనుచుండెను. కమలకు బ్రతుకు చాలాకష్టముగానుండెను. మనోవిచారము, దారిద్ర్యము గూడచేరి, అతికోమలమగు ఆమె దేహారోగ్యమును బొత్తిగా చెడిపెను. నాలుగుదినముల కొకసారి జ్వరము వచ్చుచుండెను వీటినన్నిటిని లక్ష్యపెట్టక కమల కళాశాలకు పోవుచుండెను. వైద్యుడామెను పరీక్షించి, ఆమెకు క్షయవ్యాధి యనియు, చాలా విజృంభించియున్నది గనుక అతిజాగరూకతతో ఉండవలెననియు, మంచి ఆహారము పుచ్చుకొని, విశ్రాంతిగలిగి, మంచిగాలియం దుండవలెననియు చెప్పెను.

ఒక ఇరుకువీధిలో ఒకచిన్నయింటి మేడమీద చిన్నగదిలో మంచముపై కమల అతికృశించిన శరీరముతో బరుండియుండెను. ఆమె ఎముకలగూడెమువలె నుండెనేకాని మనిషివలె లేదు. ఆమెమిత్రురాలగు లక్ష్మి, కమలకు చినిగిపోయిన విసనకఱ్ఱతో విసరుచుండెను. కమల అప్పుడప్పుడు శ్రమతోదగ్గి, నెత్తురుకలసిన కఫమును గిన్నెయందు ఉమియుచుండెను. నాటిదినము ఎండతీవ్రమునకు కమలకు నూటయైదు డిగ్రీలు జ్వరముండెను. లక్ష్మి—"కమలా, క్రూరుడగు నీఅన్న నిన్నువచ్చి చూడనుగూడలేదు గదా! ఆతండ్రి కడుపునబుట్టి, అత డైశ్వర్యముల తులతూ

గుటయు, నీవిట్లు మందుకు డబ్బులేక చచ్చుటయు ఎట్టిన్యాయము! మనచట్టము లేమిచట్టములు! మనసంఘ మేమిసంఘము! ఇట్టి ఘోర అన్యాయము మనసంఘముననే జరుగును కాని ఇంకెక్కడను జరుగదు—"

ఇంతలో ఎవ్వరో మెల్లగా తలుపుదట్టిరి. లక్ష్మి చప్పుడుచేయకుండా తలుపుతీయగా తపాలా వాడొక ఉత్తర మామె చేతికిచ్చెను. అది కమలపేరిట, ఇంటియజమానుకు బాడుగబాకికై జ్ఞప్తిచేయుచు పంపినఉత్తరము. కమల ఇంటిబాడుగ ముప్పైరూపాయలు బాకియుండెను. ఆమె పైక మంతయు ఎన్నడో సెలవై పోయెను. ఇప్పుడామె చేతిగాజులను ఒక్కొక్కటిగా అమ్మి జీవించుచుండెను. కమల తనవద్దకురాకుండా, పెండ్లిపేరంటములు లేక తనకప్రతిష్ఠ తెచ్చుచున్నదనియు, అటువంటి సోదరి తనకు లేనట్లె తానెంచుచున్నట్లును వ్రాసెను. ఆతర్వాత వారి ఒండొరుల క్షేమసమాచారములే తెలియలేదు. కమల ఆయుత్తరమును చదివి ఒకనిట్టూర్పువదలి కన్నులవెంబడినీరుకార్చెను. "లక్ష్మి, నన్నిట్లైనను ఋణవిముక్తురాలినిగా జేయుము. మాతండ్రి వెండిగడియారము నాపెట్టెలోనున్నది. దాని నమ్మియైన అప్పుదీర్పుము" అనెను.

లక్ష్మి "సోదరీ, నీ వీవిషయమై చింతపడవద్దు, నాగాజులనమ్మియైన నీఅప్పుదీర్చెదను. ఇట్టి ఘోరకృత్యములు జరుగుచున్నను వాటిని రూపుమాపుటకై ప్రయత్నము చేయక, తమసౌఖ్యముతో తృప్తిచెందుచున్న భారతపురుషుల ననవలెను. తనయులతోబాటు, మనముగూడా పుట్టలేదా? కొడుకు సమస్తసొత్తుల కధిపతియగుచుండ కూతుండ్రు తిండికిలేక దారిద్ర్యపీడితులగుచున్నారు! ఎప్పు డీఅన్యాయచట్టమను పిశాచము మన దేశము వదలును? శారదాబిల్లు దెచ్చిన మహానుభావునిబోలు హారవిలాస శారద లింక మన దేశమున లేరా? భారతభూమి గొడ్డుపోయినదా? ఇంకను ఈవిధమున ఎందరు మరణింపవలెనో! ఎప్పుడీ ఘోరచట్టము మన దేశమును వదలునో,-" కమలకు మరల దగ్గు వచ్చెను. లక్ష్మి కమలపడు శ్రమను చూడలేక డాక్టరును పిలుచుకొనివచ్చెదనని చెప్పి వైద్యునింటికి బోయెను. ఆమె వైద్యుని పిలుచుకొని వచ్చుసరికి కమల చైతన్యవిహీనయై నిద్రించుచుదానివలె బరుండియుండెను.

ఆమె తన తండ్రిని గలసుకొనబోయెను.

